క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లు



జీరో బిల్లు అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది

దౌల్తాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహజ్యోతిని శుక్రవారం నుంచి అమలు చేస్తున్నామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌కో సిబ్బంది మండల పరిధి గ్రామాల్లో మీటర్ రీడింగ్ తీశారు. గత నెలలో వాడిన విద్యుత్ గాను 200యూనిట్లు లోపు ఉన్న వినియోగదారులకు జీరో బిల్లును అందజేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. ప్రతి నెల 200యూనిట్ల లోపు కరెంట్‌ను వినియోగిస్తే జీరో బిల్లు ఇస్తామని ఏఈ మహిపాల్ తెలిపారు. గృహజ్యోతికి దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన వారు ఎంపీడీఓ కార్యాలయంలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైన్‌మెన్‌లు గోవిందు, అంజి, నర్సింహులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఉత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్షికోత్సవంలో వారు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఇందులో పూడూరు జెడ్పీటీసీ మేఘమాల, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగేశ్వర్, కృష్ణ, వెంకటేశ్, భక్తులు పాల్గొన్నారు.

పంట వివరాలు ఆన్‌లైన్ తప్పనిసరి



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గోపాల్

కుల్కచర్ల: రైతులు పండించిన పంట వివరాలను స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధి కుస్మసముద్రం గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాసంగి సాగులో తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని సూచించారు. పంటలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు, సాగు విస్తరణ అధికారులను సంప్రదించి, తగిన సూచనలు, సలహాలను తీసుకోవాలని రైతులకు చెప్పారు. పంట వివరాలను ఆన్‌లైన్ చేయడం వలన, దిగుబడిని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు రావన్నారు. మండల వ్యవసాయ అధికారి వీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు గృహజ్యోతి పథకం వర్తింపు

చేవెళ్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు ఏడీ స్వామి, ఏఈ జానీమోహినుద్దీన్‌లు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడారు. మార్చి నెల కరెంట్ బిల్లులు ఈ పథకానికి వర్తింపజేస్తున్నారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన అంశంలో వారి వివరాలను నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ సర్వీస్ నెంబర్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌లు సక్రమంగా నింపిన లబ్ధిదారుల వివరాలను అప్‌డేట్ చేశారన్నారు. ఎవరైనా దరఖాస్తు చేయని వారు ఉంటే ఆధార్, ఫోన్ నంబర్లను విద్యుత్ శాఖ అధికారులకు అందిస్తే అప్‌డేట్ చేస్తారన్నారు. చేవెళ్ల మండలంలో మొత్తం 17,928 ఇళ్ల సర్వీస్ మీటర్లు ఉన్నాయని, ఇందులో 9,229 మంది 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత పొందినట్లు తెలిపారు. షాబాద్ మండలంలో మొత్తం 12,180 ఇళ్లకు సంబంధించిన సర్వీస్ మీటర్లు ఉన్నాయని ఇందులో 6,607 మంది లబ్ధిదారులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హత పొందినట్లు చెప్పారు. వారికి ఈ నెల జీరో బిల్లు వస్తుందని వారు బిల్లు కట్టాల్సిన పని లేదని అధికారులు వివరించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- కంకర, ఆపై గుంతలతో వాహనదారుల ఇక్కట్లు
- పనులు చేపట్టి, అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్

ధారూరు: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ధారూరు మండలం రాజాపూర్–మోమిన్‌ఖుర్దు గ్రామాల మధ్య ఉన్న రెండు కిలో మీటర్ల బీటీరోడ్డు రీబీటీకి నోచుకోకపోవడంతో అడుకో గుంత ఏర్పడి, అధ్వానంగా తయారైంది. గతేడాది రీబీటీ నిర్మాణానికి రూ.91 లక్షలు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో గుంతల రోడ్డులో కాంట్రాక్టర్ కొద్ది దూరం మట్టి, కంకర పోసి, మమ అనిపించి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వం మారడంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారాయి.


తగ్గనున్న దూరభారం

గుంతల రోడ్డులో ప్రయాణించలేక వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మొదటి సారి కాంట్రాక్టర్ బీటీ నిర్మించే సమయంలో నాసిరకం పనులు చేసి, బిల్లు తీసుకుని వెళ్లిపోయారు. కాంట్రాక్టర్ మేయింటెనెన్స్ కింద రోడ్డు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా.. గుంతల రోడ్డులో కనీసం మట్టి కూడా పోయించలేక పోయారు. అధికారులు మిన్నకుండిపోవడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నిర్మించిన రోడ్డు, కొంత కాలానికే దెబ్బతిందని స్థానికులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మిస్తే ధారూరు నుంచి పరిగి పట్టణానికి 14 కిలో మీటర్ల దూరభారం తగ్గుతుందని పేర్కొన్నారు. ధారూరు, వికారాబాద్‌ల మీదుగా పరిగి వెళ్లాలంటే 40 కిలో మీటర్ల దూరం అవుతుందని, ధారూరు రాజాపూర్ మీదుగా పరిగికి కేవలం 26 కి.మీ. ఉంటుందని తెలిపారు. ఇలాంటి రోడ్డును పట్టించుకోకపోవడంతో వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డును రీబీటీ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్లాక్ లిస్ట్‌లో పెడతాం

మోమిన్‌ఖుర్దు–రాజాపూర్ గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డును రీబీటీ చేయడానికి ఎంఆర్‌ఆర్ గ్రాంట్ కింద రూ.91 లక్షల మంజూరయ్యాయి. టెండర్ పనులు కూడా పూర్తయి, కాంట్రాక్టర్‌కు అప్పగించాం. రోడ్డు పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు వదిలేశారు. అతడికి షోకాజ్ నోటీసు ఇచ్చి, పనులు చేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతాం. అతడిని సంప్రదించిన అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటాం.

– ఏఈ ప్రణీత్, మండల పంచాయతీరాజ్, ధారూరు



రాజాపూర్–మోమిన్‌ఖుర్దు గ్రామాల మధ్య మట్టి, కంకర పోసి వదిలేసిన రోడ్డు

ఆఖరి మజిలీలో అవస్థలు

- అలంకార ప్రాయంగా వైకుంఠ ధామాలు
- విద్యుత్, నీటి సౌకర్యం నిల్

దౌల్తాబాద్: ఆఖరి మజిలిని ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేలా ప్రభుత్వం.. ఆధునికమైన వైకుంఠ ధామాలను నిర్మించింది. కానీ విద్యుత్ సౌకర్యం కల్పించడం విస్మరించింది. మండలంలోని 33 పంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద శ్మశానవాటికలను నిర్మించారు. స్థల సేకరణ మొదలు.. అనేక అవాంతరాలను దాటుకుంటూ రెండేళ్లలో సర్పంచులు వైకుంఠ ధామాలను వినియోగంలోకి తెచ్చారు. ఇందుకు ఒక్కోదానికి ప్రభుత్వం రూ.12లక్షలు కేటాయించింది. కానీ తగిన సౌకర్యాలు లేకపోవడంతో అవి అలంకార ప్రాయంగా ఉన్నాయని, కర్మకాండల అనంతరం విద్యుత్తు, నీరు అత్యంత అవసరమని, కానీ అవేవి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అల్లాపూర్‌లో విద్యుత్ సౌకర్యం లేని వైకుంఠధామం

నిబంధనల ప్రకారం పనిచేస్తేనే..



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

డీఆర్‌డీఓ శ్రీనివాస్

మోమిన్‌పేట: ఉపాధి కూలీలు నిబంధనల ప్రకారం పనిచేస్తేనే పూర్తి కూలి డబ్బులు వస్తాయని డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధి వెల్‌చాల్ గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో రోజుకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రూ.272లు కూలి డబ్బులు వస్తాయని తెలిపారు. కూలీలు తక్కువ కొలతల ప్రకారం పనులు చేస్తే డబ్బులు పూర్తిగా రావన్నారు. కూలీలు వారి 100రోజుల పని దినాల్లో పూర్తి డబ్బులు తీసుకుంటేనే, అవి కుటుంబ అవసరాలకు పనికి వస్తాయని, లేకుంటే పని రోజులు వృథా అవుతాయని సూచించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని, వెసవిలో మొక్కలను ఎండనీయవద్దని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మంతు తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ తదితరులు

పెద్దేముల్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని హన్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు లోంక నీలు అన్నారు. శుక్రవారం మండల పరిధి గిర్మాపూర్ గ్రామంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్) రూ.5లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను ఎంపీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఏ–బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షుడు లోంక నర్సింహులు మాట్లాడారు. అభివృద్ధిలో పెద్దేముల్ మండలం వెనుకబడి ఉందని, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాంరెడ్డి, హరిజన్ సూరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, అంజిలప్ప, వినోద్ పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

తాండూరు టౌన్: గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన శ్రీనివాస్ (కామర్స్ అధ్యాపకుడు)ను పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించింది. పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన శ్రీనివాస్.. డిగ్రీ కళాశాలలో ప్రైవేటు అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. తాజాగా విడుదలైన ఫలితాల్లో కామర్స్ విభాగంలో ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ భూపతి రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్, బసంత్, వెంకట్ తదితరులు సన్మానించారు.

‘ఏకలవ్య’లో ప్రత్యేక పూజలు

నేడు సింధూర గణపతి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన

తాండూరు రూరల్: జినుగుర్తి శివారు ఏకలవ్య వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని సింధూర గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ఆరాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, నవగ్రహ హోమాలు, క్షీరాధివాసం తదితర కార్యక్రమాలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ ప్రతినిధి భాగయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు శేఖాపురం ఆంజనేయులు పూజలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శనివారం గణపతి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని, అ తర్వాత పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి త్రిదిండి ఆహోబిల రామానుజ జీయర్‌స్వామి రానున్నారని, కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



గణపతి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భాగయ్య తదితరులు

మాదిగ అమరవీరులకు నివాళి

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరులకు ఎమ్మార్పీఎస్ తరుపున నివాళులర్పిస్తున్నట్లు ఎమార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. వారిని స్మరిస్తూ మార్చి 1వ తేదీన అమరుల దినోత్సవాన్ని పాటిస్తున్నామని ఆయన వెల్లడించారు. 30 ఏళ్లుగా సమితి జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో రిజర్వేషన్ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ ఏడాది తప్పకుండా జరుగుతుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ శివాజి మాదిగ, వెంకటేశ్, బలరాం, అజయ్, నర్సింహులు, శివ, నవీన్, నరేష్ , నజీర్, రాము తదితరులు పాల్గొన్నారు.



అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాగునీటి సమస్యకు పరిష్కారం



మోటర్‌ను ప్రారంభించిన అజయ్‌ప్రసాద్

బషీరాబాద్: మండల పరిధి కొర్విచెడ్‌గనిలో ఎంపీపీ కరుణ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం అయింది. గనిలోని తండా కాలనీలో ట్యాంకుకు నీటి సరఫరా చేసే మోటర్‌కు రిపేరు రావడంతో.. రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మాజీ సర్పంచ్ సునీతా, ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా.. రూ.25వేల మండల పరిసత నిధులతో శుక్రవారం కొత్త మోటర్‌ను బిగించారు. దీంతో తాగునీటి సరఫరా పునరుద్ధరణ చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ మోటర్ ఆన్‌చేసి, నీటి సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్డె హన్మంతు, డీలర్ హన్మంతు, సేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



బోనాలతో ఆలయానికి వస్తున్న గ్రామస్తులు

అమ్మవారికి బోనం సమర్పించిన భక్తజనం

మర్పల్లి: ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. మండల పరిధి కోట్‌మర్పల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేద పడింతుల సమక్షంలో హోమం, ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం గ్రామస్తులు అమ్మవారికి బోనం ఎత్తారు. నెత్తిన బోనంతో భక్తులు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు.. పార్టీలకు అతీతంగా ఉత్సవంలో పాల్గొన్న నాయకులను సన్మానించారు. ఉత్సవంలో ఎంపీటీసీ సుజాత, మాజీ సర్పంచ్ విజయ లక్ష్మి, సహకార సంఘం మాజీ చైర్మన్లు అనంత్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, ఉత్సవ కమిటీ నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బిచ్చన్న శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్, జైహింద్‌రెడ్డి, శ్రావణ్, సంతోష్‌రెడ్డి, బల్‌రాంగౌడ్, వెంకటేశం గౌడ్, నర్సింహులు గౌడ్, తుల్జారాం గౌడ్, రమేశ్ యాదవ్, నర్సింహ్మారెడ్డి భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాయకులు సదానందరెడ్డి, లక్ష్మణ్, రామేశ్వర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, కృష్ణయ్య, సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పంతులు బాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గర్భగుడిలో కొలువుదీరిన అమ్మవారు

సంక్షిప్త వార్తలు

- **గుంతలు పూడ్చండి మహాప్రభో..**



తాండూరు రూరల్: మండలంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. గోపన్‌పల్లి నుంచి కరన్‌కోట్ వేళ్లే మార్గంలో గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. గుంతల రోడ్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. తాజాగా శుక్రవారం తాండూరుకు చెందిన రాజు బైక్‌పై కరన్‌కోట్ నుంచి తాండూరుకు వస్తుండగా.. గుంతలో పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతన్ని తాండూరు ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

- **మల్లన్న సన్నిధికి శివభక్తులు**



పెద్దేముల్: శ్రీశైలం మల్లికార్జునుడి చెంతకు శివభక్తులు పాదయాత్రగా శుక్రవారం బయల్దేరారు. దీక్ష పూర్తి చేసుకున్న భక్తులకు గ్రామ శివారులోని శంభులింగేశ్వర ఆలయంలో గురుస్వాములు కుమ్మరి పాండు, వడ్ల రాజు, చాకలి శేఖర్‌లు ఇరుముడి కట్టారు. అనంతరం శివభక్తులను సాగనంపారు.

- **పశువులకు టీకాలు తప్పనిసరి**

పెద్దేముల్: పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ వెంకటపతి రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 178 పశువులకు టీకాలు వేశారు. మార్చి 1 నుంచి 30 తేది వరకు గ్రామాల్లో టీకా కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ వ్యాధి సోకిన పశువుల పాల దిగుబడి తగ్గడంతో పాటు, పలు వ్యాధులు చుట్టుముడతాయని తెలిపారు. రైతులు ముందస్తు పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఇందులో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, ఇబ్రహీం, శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- **మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా నాగేశ్వర్**



పరిగి: పరిగి మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా 6వ వార్డు కౌన్సిలర్ నాగేశ్వర్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ఫ్లోర్ లీడర్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. వార్డుల్లో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

- **ఉచిత దంత వైద్య పరీక్షలు**



ధారూరు: మండల పరిధి కుక్కింద ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు జరిపారు. వికారాబాద్‌లోని సాయి డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో 240 మందికి వైద్య పరీక్షలు చేశారు. దంత సమస్యలు అధికంగా ఉన్న విద్యార్థులను, మెరుగైన చికిత్స కోసం వైద్య కళాశాలకు రావాలని వైద్యులు సూచించారు. ఇందులో డాక్టర్లు శివప్రియ, సొనాలి, అనూష, జగదీష్, ప్రత్యూష, డీఆర్‌ఓ రవీందర్, హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **రేపటి నుంచి పల్స్‌పోలియో**

కుల్కచర్ల: రేపటి నుంచి పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగనుందని మండల వైద్యాధికారి వాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పని సరిగా చుక్కల మందు వేయించాలని సూచించారు.

డబ్బును దుబారా చేయొద్దు



మాట్లాడుతున్న టీజీబీ మేనేజర్ నరేందర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నరేందర్

బంట్వారం: విద్యార్థులు డబ్బును దుబారాగా ఖర్చు చేయకుండా, పొదుపు చేయడం అలవర్చుకుంటే భవిష్యత్తు బాగుంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బార్వాద్ బ్రాంచ్ మేనేజర్ నరేందర్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోట్‌పల్లి మండలం బార్వాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సేవింగ్ అకౌంట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచే బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అందులో భాగంగా ప్రతి విద్యార్థి సేవింగ్ ఖాతాలు తెరుచుకోవాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నతికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్. వెంకటరత్నం, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచంద్రయ్య, రాజశేఖర్, అనిత, విజయ, టీజీబీ స్టాఫ్ వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి దోపిడీని అరికట్టాలి

దోమ: చెరువులో నీటిని మోటర్ల ద్వారా కొందరు రైతులు అక్రమంగా తమ పంటపొలాలకు పారిస్తున్నారని, విషయం తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. శుక్రవారం మండల పరిధి గుండాల గ్రామ సమీపంలోని ఎలియకుంట చెరువులో నీటిని గ్రామానికి చెందిన రైతులు కొందరు.. మోటర్లు బిగించి, పైపుల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇలా తరలించడం వలన.. చెరువులో నీటిశాతం తగ్గి, ఆయకట్టు రైతులు నీరు అందక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పశువులకు కూడా తాగునీరు కష్టంగా మారిందన్నారు. బడా నాయకుల అండదండలతోనే రైతులు ఈ చర్యకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి నీటి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేని యెడలా మండల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు.



చెరువు నుంచి మోటర్ల ద్వారా నీటిని తరలిస్తున్న రైతులు